నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

● రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మున్సిపాలిటీ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

శంషాబాద్ రూరల్, జూన్ 10: నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కొలన్ సుష్మ, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, కమిషనర్ సుమన్‌రావులతో కలిసి మున్సిపల్ నూతన భవన నిర్మాణం పనులు, 14వ వార్డు ఇంద్రారెడ్డినగర్ కాలనీలో మినీ ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీలో కార్యాలయం లేకపోవడంతో నిధులు కేటాయించగా, నూతన భవన నిర్మాణ పనులు 90శాతం పూర్తి అయిన్నట్లు వివరించారు. మిగితా పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

14వ వార్డులోని ఇంద్రారెడ్డి నగర్‌కాలనీలో మినీ ఫంక్షన్‌హాల్ పనులను పరిశీలించారు. ప్రతి వార్డులో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రజలకు ప్రతిరోజు తాగునీరందించి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. పనులు పరిశీలించిన వారిలో కౌన్సిలర్లు జాంగీర్ ఖాన్, మేకల వెంకటేశ్, అయిల్ కుమార్, కొన్నమొల్ల భారతమ్మ, రేఖగుప్త, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడు కొన్నమొల్ల శ్రీనివాస్, పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

ఎర్రకుంట పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్

ఎర్రకుంటలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ, జూన్ 10: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌కోట్ ఎర్రకుంటను డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్ చంద్రతో కలిసి పరిశీలించా రు. ఎర్రకుంటలో జరుగుతున్న పనుల వివరా లను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. డీఈఈ యాదయ్య, నాయకులు టింకురెడ్డి, సంతోష్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

● ఎమ్మెల్యే గోపీనాథ్‌ను కలిసిన హేమవతినగర్ బస్తీ నాయకులు

బాలును అభినందిస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

ఎర్రగడ్డ, జూన్ 10: ఎర్రగడ్డ డివిజన్ హేమవతినగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో కె.బాలు గెలుపొందాడు. ప్రత్యర్థి సురేశ్‌గౌడ్‌పై బాలు 54 ఓట్ల మెజార్టీ సాధించాడు. సోమవారం బాలుతో పాటు బస్తీ నాయకులు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిశారు. హేమవతినగర్ బస్తీ సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దపీట వేశామని మాగంటి పేర్కొన్నారు. సమస్యలను తన దృష్టికి తేవాలని సూచించారు. హేమవతినగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు బాలు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంజీవ, యాదగిరి, నర్సింగరావు, దస్తగిరి, జంగయ్య, టింకు, చంద్రశేఖర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ప్రజావాణి షురూ..

జూబ్లీహిల్స్, జూన్ 10: స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో సోమవారం యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి, ఏఎంఓహెచ్ డాక్టర్ కవిత, యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు, ఇతర అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు

శ్రీనివాస్‌గుప్తాను సన్మానిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ

చిక్కడపల్లి, జూన్ 10 : పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తగిన విధంగా గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ అన్నారు. సోమవారం గాంధీనగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రం శ్రీనివాస్ గుప్తాను సన్మానించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, నాయకులు శ్రీకాంత్, జీవై గిరి, రవి శంకర్‌గుప్తా, బి.కిరణ్, ఎంబి.కృష్ణ, కుమారస్వామి, రచ్చ నరేశ్, సాయి చాణిక్యరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సంజయ్‌గాంధీనగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, జూన్ 10: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల్లో పేరుకుపోయిన వ్యరాలను తొలగించి బస్తీవాసులకు ఎలాంటి ముప్పు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ అధికారులను హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి ఆదేశించారు. సోమవారం సంజయ్‌గాంధీ కాలనీ, ఓల్డ్ కమేలా బస్తీల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి దీపాల మరమ్మతులు, మంచినీటి, డ్రైనేజీ తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రజలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయా శాఖల అధికారులకు సమాచారం అందించి తక్షణమే పనులు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్, ఏఈ దివ్య, కాంగ్రెస్ నేతలు జి.రామన్‌గౌడ్, మహేశ్ పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

జలమండలి ఆధ్వర్యంలో రూపొందించిన ఫ్లెక్సీలు ఆవిష్కరిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి; తదితరులు

బంజారాహిల్స్, జూన్ 10: వర్షాకాలంలో మ్యాన్‌హోల్స్ వల్ల ప్రమాదాలు జరగకుండా జలమండలి జాగ్రత్తలు తీసుకోవాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. జలమండలి ఆధ్వర్యంలో మ్యాన్‌హోల్స్ వద్ద అప్రమత్తత కోసం, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయనున్న ఫ్లెక్సీలు, ఫోస్టర్లను సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి బంజారాహిల్స్‌లోని తమ క్యాంపు కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. అనుమతి లేకుండా మ్యాన్‌హోళ్లను తెరవవద్దని, వరదనీరు ప్రవహిస్తున్న సమయంలో పిల్లలతోపాటు పెద్దలు అప్రమత్తంగా ఉండాలని మేయర్ సూచించారు.కార్యక్రమంలో జలమండలి జీఎం హరిశంకర్‌తో పాటు వివిధ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ తవ్వకాలు

● అడ్డుకున్న పోలీసులు

ఖైరతాబాద్, జూన్ 10: ప్రభుత్వ స్థలంలో ఓ వ్యక్తి అక్రమంగా తవ్వకాలు చేపట్టాడు. స్థానికులు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పోలీసుల సహకారంతో అడ్డుకున్నారు. సోమాజిగూడలోని దుర్గానగర్‌కాలనీలోని మైసమ్మ దేవాలయం పక్కన నుంచి స్థానికులు వెళ్లేందుకు రహదారి ఉంది. అయితే స్థానికంగా నివాసం ఉండే ఇద్దరు వ్యక్తులు గుడిని ఆనుకొని ఉన్న రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకొని తవ్వకాలు చేపట్టారు. దీంతో పెద్ద పెద్ద గుంతల్లో వర్షపు నీరు నిండి చిన్నపిల్లలు అందులో పడిపోయే ప్రమాదం నెలకొంది. దీంతో ఖైరతాబాద్ తహసీల్దార్, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయగా, పోలీసుల సహకారంతో తవ్వకాలను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నిస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మగువల మనసు దోచే వస్త్ర ప్రదర్శన

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటుంది. సోమవారం మణికొండ సుందర్‌గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అక్బర్ అలీ మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ మరో వారం పాటు పోడిగించినట్లు తెలిపారు. అన్ని రకాల చీరలతో పాటు మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కాంతా వర్క్ శారీస్, హ్యాండ్‌బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లెనిన్ సారిస్, బెంగల్ కాటన్ సారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైన్ బ్లౌజ్ లక్నో బెనారస్ శారీస్ ఖాదీ మెటీరియల్ వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ జైపూర్ బెడషీట్స్ కొండపల్లి బొమ్మలు ఇలా మరెన్నో రకరకాల వస్తువులను ఈ ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎగ్జిబిషన్ ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

హజ్‌కు బయల్దేరిన యాత్రికులు

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి హజ్‌యాత్రకు వెళ్తున్న ముస్లింలు

శంషాబాద్ రూరల్, జూన్ 10: తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి సోమవారం హజ్ యాత్రికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి వెళ్లారు. యాత్రికులకు వారి కుటుంబ సభ్యులతోపాటు హజ్ కమిటీ చైర్మన్ కౌసర్ పాషా విడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు తమ జీవితంలో ఒక్కసారైన హజ్ యాత్రకు వెళ్లిరావాలని అన్నారు. హజ్ యాత్రలో భాగంగా మక్కా-మదీన పుణ్యక్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని వివరించారు. యాత్రికులతో పాటు నిర్వాహకుడు మహ్మద్ ఫయాజ్ అలీ తదితరులు ఉన్నారు.

సమసమాజ నిర్మాణం కోసం 'ది సిటిజన్స్ కౌన్సిల్'

మణికొండలో ది సిటిజన్స్ కౌన్సిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ తదితరులు

మణికొండ, జూన్ 10: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు ఎడ్యుకేట్, ఆర్గనైజ్, యాజిటేట్ అనే పదాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని సామాజిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రజల్లో కనీస అవసరాల పట్ల అవగాహన కల్పించి మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో భాగంగా ది సిటిజన్స్ కౌన్సిల్ సంస్థను ప్రారంభించామని ఆ సంస్థ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహ్మద్ అన్నారు. మణికొండలో సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అందే లక్ష్మణ్‌రావు, ఉప కార్యదర్శిగా ఉపేందర్‌రెడ్డి, కోశాధికారిగా దిలీప్ కక్కడ్, కార్యనిర్వాహక సభ్యులుగా రామసుబ్బారెడ్డి, విద్యాసాగర్‌లను ఎన్నుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ సంస్థల పనితీరులో పారదర్శకత ఉండేలా, ప్రజలకు సుపరిపాలన అందించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్, తదితరులు

మణికొండ, జూన్ 10: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. నార్సింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెలలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో స్కూల్‌కు వచ్చే విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు, కమిషనర్ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, కౌన్సిలర్లు లక్ష్మిప్రవళికకిరణ్, పత్తి ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ ప్రెసిడెంట్ క్యాతం అశోక్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌బాబుకు బంగారు పతకం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 10: ఇటీవల గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన క్రీడా పోటీలలో 65 ఏళ్ల కేటగిరీలో 70 ఏళ్ల రమేశ్‌బాబు బంగారు పతకం సాధించారు. పతకం సాధించిన ఆయనను శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓయూ సైక్లింగ్ స్టేడియంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ 14 రాష్ట్రాల నుంచి 400 మంది పరుగుపందెంలో పోటీ పడగా, తాను మొదటి స్థానంలో నిలిచి బంగా రు పతకం సాధించినట్లు వివరించారు. గతంలో వివిధ పోటీలలో ఇప్పటికే ఈ కార్యక్రమంలో శాలిబండ సైక్లింగ్ క్లబ్, తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చింతల జన్మదిన వేడుకలు

జూబ్లీహిల్స్, జూన్ 10: ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా కింగ్‌కోఠి ఆస్పత్రిలో బీజేపీ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.నర్సింగ్‌గౌడ్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు పందిళ్ల ప్రసాద్, సందీప్, వేణుగోపాల్‌గౌడ్, ప్రవీణ్, మీర్జా, అర్జున్ సింగ్ ఠాకూర్, దవాఖాన ఆర్ ఎంఓ పాల్గొన్నారు.

ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ అథ్లెటిక్స్ చాంప్‌నకు శ్రీకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి జూన్ 10: ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్-2024 ఎఫిషియెన్సీ స్కిల్ రన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.వరప్రసాద్, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్-2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ ప్రారంభించారు. పురుషుల 100, 800 మీటర్ల పరుగుతో పాటు షాట్‌పుట్, లాంగ్ జంప్ నిర్వహించారు. అనంతరం నైపుణ్య పరీక్షలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జే.ప్రభాకర్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి మనోవర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలపై విచారణ జరిపించాలి

నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

ఖైరతాబాద్, జూన్ 10: నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తాలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జె.మల్లేశ్, సత్యనారాయణ, గంగాధర్, తేజ, వినోద్, శేషాంక్, ప్రణవ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్లకు ప్రోత్సాహం

సుల్తాన్‌బజార్, జూన్ 10. ప్రభుత్వ ఐటీఐల విద్యార్థులకు ఆయా ట్రేడ్‌లలో విద్యతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఇన్నోవేషన్లకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ సనత్‌నగర్ ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం విజయనగర్‌కాలనీ మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ ఆవరణలో ఉన్న సనత్‌నగర్ ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లలో మొదటి, రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రూపొందించిన ఇన్నోవేషన్లను ఆయన తిలకించి విద్యార్థులను అభినందించారు. సహాయ శిక్షణాధికారి శ్రావణ్ స్వరూప్ నేతృత్వంలో విద్యార్థులు హాస్టల్ రూమ్‌లో విద్యుత్ బల్బుల వినియోగంపై ఇన్నోవేషన్ రూపొందించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంప్ రన్నరప్‌గా..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ, ఆట ప్రతినిధి జూన్ 10 : నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్ రన్నరప్ టైటిల్‌ను హైదరాబాద్ సూపర్ కింగ్స్‌గా హాస్పిటల్స్ జట్టు నిలిచింది. ముంబై క్రికెట్ స్పోర్టాన్స్ హాస్పిటల్స్ జట్టు టైటిల్‌ను దక్కించుకుంది. సోమవారం రాజేంద్రనగర్‌లోని విజయ్ ఆనంద్ క్రికెట్ మైదానంలో మైటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే ఆధ్వర్యంలో జరిగిన ఫైనల్స్‌లో ముంబై హాస్పిటల్స్ జట్టు ఐదు వికెట్లతేడాతో హైదరాబాద్ హాస్పిటల్స్ జట్టు పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ హాస్పిటల్స్ జట్టు 143 పరుగులు చేసింది. ముంబై హాస్పిటల్స్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. విజేతలకు నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ చాంపియన్‌షిప్‌ను ఫారెస్ట్ నేషన్ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శరత్ నలమోతు, మైటీ స్పోర్ట్స్ డైరెక్టర్ నంద పాండే, కో డైరెక్టర్ నిఖిల్ సంపత్, ఇంతియాజ్ బేగ్ తదితరులు ట్రోఫీని అందజేశారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండేలా 'బడిబాట'

యూసుఫ్‌గూడ ప్రభుత్వోన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

జూబ్లీహిల్స్, జూన్ 10: పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత విద్యపై విస్తృత ప్రచారం చేపడుతున్నారు. ఉచితంగా 2 జతల యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన సౌకర్యాలపై ప్రచారం చేపడుతున్నారు. బడీడు పిల్లలు బడిలోనే ఉండేలా బస్తీల్లో అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్నారు. నగరంలో కూలీ పనుల కోసం వచ్చి పిల్లలను బడికి పంపకుండా తమకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఇంటి పనులకు, డబ్బు సంపాదన కోసం బాల్యంలోనే బయటి పనులకు పంపించే తల్లిదండ్రులపై దృష్టి పెడుతున్నారు. చదువుకుంటేనే ప్రగతి సాధ్యమని ప్లకార్డులతో, బ్యానర్లతో విస్తృత ప్రచారం చేపడుతున్నారు.

ఖైరతాబాద్-2 మండలంలోని యూసుఫ్‌గూడ, శ్రీరాంనగర్, బోర బండ, జవహర్‌నగర్ ఉన్నత పాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలల్లో విస్తృతంగా బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ డీఈఓ సామ్యూల్ రాజ్ ఆదేశాలతో ఖైరతాబాద్-2 డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్‌కుమార్ ఉపాధ్యాయులతో కలిసి బడిబాట నిర్వహిస్తున్నారు.

అన్నివర్గాలకు అండగా ఉంటాం..

● నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్

కోకాపేట్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ విజయ్‌బాబును సన్మానిస్తున్న ఎస్సీ సంఘం సభ్యులు

మణికొండ, జూన్ 10: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్, వైస్ చైర్మన్ గోపాల విజయ్‌బాబు తెలిపారు. సోమవారం కోకాపేట్‌లో ఎస్సీ సంఘం సభ్యులు నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రాంతాల అభివృద్ధికి తమవంతు బాధ్యతగా పని చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను చేపడతామని చెప్పారు. అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ మున్సిపాలిటీని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేశ్‌యాదవ్, లక్ష్మీప్రవళికకిరణ్, గోపాల్, సునీత, గణేశ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ గండిపేట మండల అధ్యక్షుడు అశోక్‌యాదవ్, ఎస్సీ సంఘం అధ్యక్షుడు ఆర్.యాదగిరి, ఉపేందర్, శిరీశ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వసూలుపై అధికారుల దృష్టి

● జూలై నుంచి మొదటి అర్ధభాగంపై 2 శాతం వడ్డీ

యూసుఫ్‌గూడ జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం

జూబ్లీహిల్స్, జూన్ 10: వార్డుల అభివృద్ధి లక్ష్యంగా జీహెచ్ఎంసీ అధికారులు ఆస్తిపన్ను వసూలుపై దృష్టి సారించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆస్తిపన్ను వసూలుకు విరామం ఇచ్చిన అధికారులు వార్డుల వారీగా ఆస్తిపన్ను వసూలు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభంకాగా ఎన్నికల కోడ్‌తో ఆస్తిపన్ను వసూలుకు బ్రేక్ పడింది. జూన్ మొదటి వారం వరకు ఎన్నికల పనుల్లో తలమునకలైన జీహెచ్ఎంసీ అధికారులు తాజాగా ఆస్తిపన్ను వసూలుపై దృష్టి పెట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జూన్ 30 వరకు అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంటుంది. మొదటి విడత అర్ధభాగం ఆస్తిపన్నుపై జూలై నెల నుంచి 2 శాతం వడ్డీ జమ కానుంది. దీంతో ఆస్తిపన్ను వసూలుకు బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ఇంటింటికీ డిమాండ్ నోటీసులు జారీ చేస్తున్నారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు చెల్లించాల్సిన 6 నెలల ఆస్తిపన్ను బిల్లులను ప్రతి ఇంటికీ వెళ్లి అందజేస్తున్నారు. యూసుఫ్‌గూడ సర్కిల్ పురోభివృద్ధికి ప్రతిఒక్కరూ ఆస్తిపన్ను సకాలంలో చెల్లించాలని.. జూన్ 30లోపు మొదటి విడత ఆస్తిపన్ను చెల్లించి అపరాధ రుసుం నుంచి మినహాయింపు పొందాలని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు.

బస్తీ సంఘం అధ్యక్షుడికి సన్మానం

ఖైరతాబాద్ నియోజకవర్గం హిమాయత్‌నగర్ డివిజన్ రాజ్ మొహల్లా బస్తీలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ